సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజలు ఎంతో ప్రత్యేకంగా నిర్వహించుకునే సంక్రాంతి పండుగ ప్రజలందరి జీవితాల్లో సుఖ సంతోషాలు నింపాలని కలెక్టర్ అంబేడ్కర్ ఆకాంక్షించారు. ప్రజందరికీ భోగి, సంక్రాంతి, కనుము శుభాకాంక్షలు తెలిపారు. భోగి పండగ భోగ భాగ్యాలు కలిగించాలని, అందరి ఇళ్లల్లో సంక్రాంతి శోభ సంతరించాలని, మూడు రోజులూ పండుగ సందడితో ప్రతి ఒక్కరూ ఆనందంగా గడపాలని కలెక్టర్ పేర్కొన్నారు.



బొబ్బిలి మండలం రాజచెరువువలసలో భోగి పిడకల దండలతో చిన్నారులు

నేడే భోగి

● సందడి చేసేందుకు ప్రజలంతా సిద్ధం ● భోగి పిడకలతో చిన్నారుల కేరింత

విజయనగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):

సంక్రాంతి వచ్చేసింది. ఊరు.. వాడకు నూతన సోయగాన్ని తెచ్చేసింది. ఆబాలగోపాలం ఆనందంతో కేరింతలు కొట్టే సమయం ఆసన్నమైంది. భోగి రూపంలో సంక్రాంతి అందరికీ ఆహ్వానం పలికింది. ఆదివారం నాటికి జిల్లా వాసులంతా దాదాపు వచ్చేశారు. ఎక్కడెక్కడో పనిచేసుకుంటూ జీవిస్తున్న వారంతా కుటుంబాలతో దిగిపోయారు. వారి రాకతో పల్లెలు కళకళలాడుతున్నాయి. ఏడాదిలో ఎన్ని పండుగలున్నా సంక్రాంతి ప్రత్యేకత, విశిష్టత వేరు. ఏటా మాదిరిగా పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకునేందుకు అంతా సిద్ధమయ్యారు. ఇప్పటికే అందరి ఇళ్లల్లో కోలాహలం నెలకొంది. అల్లుళ్లు, కూతుళ్లు, మనుమలు, మనుమరాళ్లతో కొత్తశోభ ప్రస్ఫుటమవుతోంది. పల్లెల్లో ప్రతి ఇంటి వాకిట రంగవల్లులు ముచ్చట గొలుపుతున్నాయి. హరిదాసుల కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలు సంక్రాంతికి నిండుదనాన్నిస్తున్నాయి. పండుగలో భాగంగా తొలి రోజు భోగిని ఆనందంగా జరుపుకోవడానికి ప్రజలు సిద్ధమయ్యారు. వివిధ ఆధ్యాత్మిక, స్వచ్ఛంద సంస్థలు తమ, తమ ప్రాంతాల్లో భోగి మంటలు వేసుకునేందుకు ఏర్పాట్లు చేశాయి. కర్రలు, చెక్కలు సేకరించాయి. చిన్నారులు భోగి పిడకలను తయారు చేసి దండగా కట్టారు. ఇక సోమవారం ఉదయం 3 నుంచి 4 గంటల మధ్య భోగి మంటలు వేసుకుని పండుగ వేళలను ఆస్వాదించడమే తరువాయి.

నేడు గోదాదేవి కల్యాణం..

భోగి పండుగ రోజు గోదాదేవి కల్యాణం నిర్వహిస్తారు. వేంకటేశ్వరస్వామి, కృష్ణా ఆలయాల్లో, ముఖ్యంగా వైష్ణవ ఆలయాల్లో గోదాదేవి కల్యాణం నిర్వహించడం ఆనవాయితీ. జిల్లా కేంద్రంలోని మన్నార్ రాజగోపాల స్వామి ఆలయం, శివాలయం వీధిలోని వెంకటేశ్వర స్వామి ఆలయం, తోటపాలెంలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రింగురోడ్డులోని కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయాలు గోదాదేవి కల్యాణం జరుపుకునేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాయి.

పండగలా దిగివచ్చారు..

● కిటకిటలాడిన ఆర్టీసీ బస్సులు, రైళ్లు

విజయనగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రైళ్లు కిటకిటలాడాయి. బస్సులు కూర్చొనేంత స్థలం కూడా లేకుండా కిక్కిరిసిపోయాయి. ఇక ప్రైవేటు వాహనాలైతే జనంతో వేలాడుతూ కనిపించాయి. సంక్రాంతికి వెళ్తున్నామన్న ఆనందంలో ఎలాగైనా ఇంటికి చేరడమే లక్ష్యంగా చేసుకుని జిల్లా వాసులు ప్రయాణించారు. ఆదివారం ఎక్కువ మంది జిల్లాకు చేరారు. చాలా మంది విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్‌లో దిగారు. అక్కడి నుంచి వివిధ వాహనాల్లో మళ్లీ పయనమయ్యారు. సంక్రాంతి రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆర్టీసీ కూడా ప్రత్యేక బస్సులను కేటాయించింది. విజయనగరం నుంచి పార్వతీపురం మన్యం జిల్లాకు, విజయనగరం నుంచి విశాఖ, అనకాపల్లి, విజయవాడ, హైదరాబాదు వంటి ప్రాంతాలకు బస్సులు నడుపుతోంది. అదే విధంగా రైళ్లను కూడా పెంచారు.





రైల్వేస్టేషన్ నుంచి బయటకు వస్తున్న జిల్లా వాసులు

పండుగ వేళ.. ధరల దరువు

● ఇష్టారాజ్యంగా వ్యాపారులు ● పిండి వంటల సామగ్రి ధరలు మరింత అధికం



గజపతినగరం/గంట్యాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): అసలే సంక్రాంతి పండుగ. ఇంటికి బంధువులు, స్నేహితులు వస్తారు. అవసరమైన నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి వారిని సంతోష పెట్టాలి. దీనిని ఆసరాగా చేసుకుని వ్యాపారులు, దళారులు ధరలు పెంచుకుపోతున్నారు. కూరగాయల ధరలు కూడా కొండెక్కి కూర్చున్నాయి. బియ్యం రేట్లు బరువెక్కాయి. వంటనూనెలు సలసల కాగుతున్నాయి. చికెన్ ధరలు అమాంతంగా పెరిగిపోతున్నాయి. సంక్రాంతి పండుగలో పిండి వంటలది కీలక పాత్ర. వాటిని తయారు చేయాలంటే ముడిసరుకుగా బెల్లం, పప్పులు, వంట నూనె తప్పనిసరి. వీటి ధరలను అమాంతం పెంచేశారు. వంట నూనె కిలో రూ.125కాగా రకాన్ని బట్టి రూ.165కి విక్రయిస్తున్నారు. బియ్యం కిలో రూ.50నుంచి రూ.75వరకు ధర పలుకుతోంది. బాస్మతి రైస్ కిలో రూ.80నుంచి రూ.120కి చేరుకుంది. రానున్న రెండు రోజుల్లో ధరలు మరింత పెరిగినా ఆశ్చర్యపడనవసరం లేదు. పెసరపప్పు రూ.125 నుంచి రూ150 వరకు రకాన్ని బట్టి అమ్ముతున్నారు. వేరుశెనగ పలుకులు రూ.140నుంచి రూ.170కి ఎగబాకాయి. మినపగుళ్లు రూ.130 నుంచి రూ.160కి చేరుకున్నాయి. వెల్లుల్లి గత నెల నుంచి రూ.400 నుంచి ధర దిగిరాలేదు.

కూరగాయలూ కొండెక్కాయి..

కూరగాయలు ధరలు కూడా గత రెండు వారాల నుంచి కొండెక్కి కూర్చున్నాయి. ఇటీవల తుఫాన్ కారణంగా కొన్ని పంటలు పోయాయి. రెండో దఫా వేసినా తెగుళ్లతో పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. సాధారణంగా బీరకాయలు, దొండకాయలు, వంకాయలు కిలో రూ.30 నుంచి రూ.40వరకు ధరలు ఉండేవి. ప్రస్తుతం రూ.80 పలుకుతున్నాయి. చిక్కుడు కాయలు, చామ దుంపలు, బంగాళా దుంపలతో పాటు ఆకు కూరల ధరలను అమాంతం పెంచేస్తున్నారు. మరోవైపు చికెన్, మటన్, చేపల ధరలు కూడా అధికంగానే ఉన్నాయి.

భోగి మంటకు ఆ గ్రామాలు దూరం

నెల్లిమర్ల/ మెరకముడిదాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వేర్వేరు కారణాలతో రెండు గ్రామాల్లో భోగి మంటలు వేయడం లేదు. 50 ఏళ్ల కిందట గ్రామస్థులు వేసుకున్న భోగి మంటల్లో పడి ఓ వ్యక్తి కాలిపోవడంతో అప్పటి నుంచి నెల్లిమర్ల మండలం అలుగోలు గ్రామస్థులు భోగి మంట వేయడం మానేశారు. ఇప్పటితరం కూడా పెద్దల సంప్రదాయాన్ని అనుసరిస్తోంది. మెరకముడిదాం మండలంలోని చినబంటుపల్లి గ్రామంలో కూడా దశాబ్దాల కాలం నుంచి భోగి మంట వేయడం లేదు. ఒకప్పుడు భోగి జరుపుకుంటుండగా ఓ వృద్ధుడు మంటల్లో పడి చనిపోయాడు. అప్పటి నుంచి భోగి మంటలు వేస్తే గ్రామానికి అరిష్టం కలుగుతుందని మానేశారు.

కోడి పందేలను డ్రోన్ కెమెరాలతో కనిపెడతాం

● ఎస్పీ వకుల్‌జిందాల్



విజయనగరం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు సంక్రాంతిని సంప్రదాయ పద్ధతిలో జరుపుకోవాలని సూచిస్తూ కోడి పందేలను నిర్వహిస్తే డ్రోన్ కెమెరాలతో కనిపెడ తామని ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశా రు. కోడిపందేలు, పేకాట నిర్వహించేవారిపై ప్రత్యే క నిఘా పెడుతున్నామన్నారు. గతంలో పేకాట, కోడి పందేలతో ప్రమేయం వున్న 109 మందిని గుర్తించి మంచి ప్రవర్తన కోసం బైండోవర్ చేశామన్నారు. క్షేత్రస్థాయిలో కోడి పందేలు నిర్వహించే ప్రాంతాలను డ్రోన్ కెమెరాతో పర్యవేక్షిస్తామన్నారు. సంక్రాంతి పండుగ పేరుతో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చట్టపర మైన చర్యలు తప్పవన్నారు. కోడి పందేల నియంత్రణకు హైకోర్టు ఆదేశా లతో మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసులు, జంతు సంరక్షణ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేశామన్నారు. పండుగలకు సొంత గ్రామాలకు వెళ్లేవారు ఎల్‌హెచ్‌ఎంఎస్ మొబైల్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సంక్షేమం.. అభివృద్ధికి ప్రాధాన్యం

● రాష్ట్రంలో ప్రగతి దిశగా పాలన
● మరెన్నో పరిశ్రమలు వచ్చే అవకాశం
● మంత్రి కొండపల్లి శ్రీనివాస్



విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్

విజయనగరం రూరల్/ విజయనగరం రింగురోడ్డు, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ ప్రగతి దిశగా పరిపాలిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం వచ్చాక ఏడు నెలల కాలంలో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకువెళ్తున్నారన్నారు. బయోటెక్నాలజీ, ఈవీ క్లస్టర్‌ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. సంక్రాంతి శుభవేళ చాలా రోజుల నుంచి పెండింగ్‌లో వున్న పలు సమస్యలకు ముఖ్యమంత్రి చంద్రబాబు పరిష్కారం చూపారన్నారు. గత ఐదేళ్లలో పెండింగ్‌లో వున్న సుమారు రూ.6,750 కోట్ల బకాయిలను విడుదల చేసి వివిధ వర్గాల్లో వెలుగులు నింపారన్నారు. ముఖ్యంగా ఉద్యోగులకు పేరుకుపోయిన బకాయిలను విడుదల చేసినట్లు చెప్పారు. బకాయిల్లో ఉపాధ్యాయ, ఉద్యోగుల జీపీఎఫ్ కింద రూ.519 కోట్లు, పోలీసుల సరెండర్ లీవుల కోసం రూ.788 కోట్లు విడుదల చేసి సుమారు 54,900 మందికి ప్రయోజనం చేకూర్చామన్నారు. జిల్లాలో 2 లక్షల 70 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడంతో పాటు రెండు రోజుల్లోనే డబ్బులు జమ చేయడం వల్ల రైతులు ఎంతో సంతోషంగా వున్నారన్నారు. ముఖ్యమంత్రి పరిపాలనపై నమ్మకంతో రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎందరో పారిశ్రామిక వేత్తలు ఆసక్తి కనబర్చుతున్నారన్నారు. తాటిపూడిలో బోటు షికారును ఏర్పాటు చేశామని, రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవే, భోగాపురం విమానాశ్రయం పూర్తయితే ఉపాధి అవకాశాలు మరింత విస్తృతమౌతాయన్నారు. సమావేశంలో క్రికెట్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రంధి అర్జున మహేశ్వరరావు, టీడీపీ నాయకులు కడగల ఆనందకుమార్, చొప్పా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభించిన మంత్రి

విజయనగరం ఆర్టీసీ బస్సు డిపోలో ఆదివారం నాలుగు నూతన ఎక్స్‌ప్రెస్ బస్సులను మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆర్టీసీ ప్రాంతీయ చైర్మన్ దున్నుదొరతో కలిసి ప్రారంభించారు. విజయనగరం, ఎస్.కోట, పార్వతీపురం డిపోలకు సంబంధించిన ఈ నాలుగు బస్సులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్టీసీ విజయనగరం జోన్-1 ఈడీ ఎ.విజయ్‌కుమార్, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లా ప్రజారవాణాధికారులు సీహెచ్ అప్పలనారాయణ, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఏపీఎస్ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దున్నుదొర



వణుకుతున్నారు..



విజయనగరం సమీపంలో దట్టంగా కురుస్తున్న మంచు

● జిల్లాలో పెరిగిన చలి ● ఉదయం 8 గంటలైనా తగ్గని తీవ్రత
● అపరాలకు పొంచి ఉన్న నష్టం

రాజాం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. కొద్దిరోజులుగా పగటి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. సాయంత్రం 4 గంటల నుంచే చలిగాలులు ప్రారంభమవుతున్నాయి. రాత్రికి మంచు విపరీతంగా కురుస్తోంది. ఎముకలు కొరికే చలిలో ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. ఉదయం 8 గంటల వరకూ పొగ మంచు పడుతుండడంతో రహదారులపై ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. దీంతో ప్రమాదాలు సైతం జరుగుతున్నాయి. ఇంకో వైపు వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బందిపడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరం, ఆయాసం, గుండె సంబంధిత ఇబ్బందులతో ఎక్కువ మంది ఆస్పత్రుల్లో చేరుతున్నారు. గడిచిన వారం రోజుల్లో జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ 5 వేలకు పెరిగిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. వీలైనంత వరకూ కాచి వడబోసిన నీటిని తాగాలని... చల్లని, నిల్వ ఆహార పదార్థాలు తీసుకోకూడదని వైద్యులు సూచిస్తున్నారు. మంచు కురుస్తున్న సమయాల్లో బైక్‌పై ప్రయాణాలు మానుకోవాలంటున్నారు. కాగా పొగ మంచు కురుస్తుండడంతో అపరాలకు నష్టం తప్పేలా లేదు. సాధరణంగా రబీలో భాగంగా జిల్లాలో పెసర, మినుము, నువ్వు, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి వంటి పంటలను రైతులు ఎక్కువగా పండిస్తారు. పొగ మంచు పడుతుండడంతో పంటలో ఎదుగుదల లేదు. నష్టం తప్పదేమోనని రైతులు భయపడుతున్నారు.

పైడిమాంబను దర్శించుకున్న పాట్నా హైకోర్టు జడ్జి



పైడిమాంబ ఆలయంలో జడ్జి కుటుంబ సభ్యులు

విజయనగరం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పైడిమాంబను ఆదివారం మూడులాంతర్ల వద్ద వున్న చదురుగుడిలో పాట్నా హైకోర్టు జడ్జి జస్టిస్ అనుపమా చక్రవర్తి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారికి ఆలయ మర్యాదలతో దేవాలయ అర్చకులు, సిబ్బంది స్వాగతం పలికారు. పూజల అనంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందించారు. పైడిమాంబ జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఏవో ఏడుకొండలు, పూజారి బంటుపల్లి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వంటకాలు.. సంప్రదాయ చిహ్నాలు

5లో

● అమిత శక్తిదాయకాలు
● ప్రతి ఇంటా పిండి వంటలు
● ప్రత్యేక శ్రద్ధతో తయారు చేస్తున్న గ్రామీణులు



కూలిన రైవాడ కాలువ కల్వర్టు

● బల్లంకి, బానాది, ఎం.సింగవరం గ్రామాల ప్రజలకు ఇబ్బందులు



5లో

సంక్రాంతి వంటకాలు.. సంప్రదాయ చిహ్నాలు

● అమిత శక్తిదాయకాలు ● ప్రతి ఇంటా పిండి వంటలు ● ప్రత్యేక శ్రద్ధతో తయారు చేస్తున్న గ్రామీణులు

విజయనగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి)



సంక్రాంతి... తెలుగు వారి పెద్ద పండుగ. పల్లెల నుంచి పట్టణాల దాకా సంక్రాంతి పండుగను మూడు రోజుల పాటు నిర్వహించడం సంప్రదాయం. భోగి, సంక్రాంతి, కనుమ ఇలా మూడు రోజుల పాటు చేసుకునే పండుగను తలచుకోగానే చటుక్కున గుర్తించేవి పిండి వంటలు. అయినవాళ్లతో కలిసి కబుర్లు చెప్పుకుంటూ ఆరగించడం.. ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకోవడం పల్లెల్లో సర్వ సాధారణం. పండుగ సందర్భంగా తయారు చేసుకునే జంతికలు, అప్పాలు, అరిసెలు, బొబ్బట్లు, బూరెల వంటి పిండి వంటల్లో సంప్రదాయంతో పాటు మన ఆరోగ్యానికి మేలు చేసే సుగుణాలు ఉన్నాయని వైద్యులు చెబుతున్నారు. మన పెద్దలు సంప్రదాయమంటూ ఏం చెప్పినా.. దాని వెనుక ఏదో ఒక పరమార్థం ఉండేలా జాగ్రత్త పడ్డారు. అలా సంక్రాంతికి చేసుకునే వంటలకూ ఎంతో ప్రత్యేకత ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతికి ప్రతి కుటుంబం అరిసెలు, బొబ్బట్లు, కజ్జికాయలు, వివిధ రకాల లడ్డూలు, నువ్వుల ఉండలు, వేరుశెనగ ఉండలు, మైసూర్ పాక్ వంటి మిఠాయిలతో పాటు చెక్కిలాలు, జంతికలు, మిక్చర్ వంటివి తయారు చేస్తారు. దాదాపు 20 రోజులకు పైగా నిల్వ ఉండే అత్తిరసాలు, కజ్జికాయలను పండుగ తర్వాత కూడా ఇళ్లకు వచ్చే వారందరికీ పంచుతుంటారు.

బలాన్నిచ్చే అరిసెలు



వీటి తయారికి ప్రధానంగా బియ్యం పిండి, బెల్లం, కొబ్బరి వినియోగిస్తారు. బియ్యంలో కార్బోహైడ్రేట్లు, బెల్లంలో ఇనుము(ఐరన్) సమృద్ధిగా ఉంటాయి. దీంతో రక్తవృద్ధి, శుద్ధి జరుగుతుంది. అదే మంచి ఆవు నెయ్యితో చేస్తే కొలెస్ట్రాల్ శాతం బాగా తక్కువగా ఉండటమే కాక మంచి పుష్టికరమైన ఆహారంగా కూడా పని చేస్తుంది. కొబ్బరి బలమైన ఆహారం, బియ్యం, బెల్లం త్వరగా బలాన్నిచ్చే దినుసులు. ప్రత్యేకించి బెల్లం అజీర్ణాన్ని అరికడుతుంది. రోజుకు నాలుగైదు చొప్పున తింటే ఎనలేని శక్తి సమకూరుతుంది. మనిషికి కండ పెరుగుతుంది. తక్కువ ఖర్చుతో బలమైన శక్తినిచ్చేవి అరిసెలే.

కజ్జికాయలు



కజ్జికాయలను బెల్లం లేదా చక్కెర, శనగపప్పు, కొబ్బరి, గోధుమ పిండితో తయారు చేస్తారు. బెల్లం, చక్కెరలో ఐరన్, గోధుమ పిండిలో ప్రొటీన్లు, పప్పులో కార్బోహైడ్రేట్లు ఉంటాయి. వీటిల్లో వాడే యాలకులు కూడా మంచి రుచిని ఇవ్వడమే కాదు, జీర్ణశక్తిని పెంచుతాయి. ఆకలి బాగా ఉండేలా చేస్తాయి.

బొబ్బట్లు



శనగపప్పు, బెల్లం మిశ్రమంతో బొబ్బట్లు చేస్తారు. ఈ మిశ్రమానికి పైపూతగా గోధుమ పిండి లేదా మైదా పిండిని వాడుతారు. నెయ్యితో చేసే ఈ మిఠాయిలో వేసే శనగల్లో ప్రొటీన్, కార్బోహైడ్రేట్లు దండిగా ఉంటాయి. బెల్లంలో ఉండే ఇనుము మంచి శక్తివాహకంగా పనిచేస్తుంది. గోధుమపిండి, మైదా పిండి రెండూ బలవర్ధకాలే. వెరుశెనగ నూనె కంటే రుచికరమైన నెయ్యిలో కొవ్వు పదార్థాలు తక్కువ. అయితే బొబ్బట్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. గరిష్ఠంగా రెండు రోజులకు మించి నిల్వ ఉంచడం మంచిది కాదు.

లడ్డు..



రుచి, శుచిలతో పాటు బలానికి మారుపేరు లడ్డు. ఇందులో చాలా రకాలు ఉన్నాయి. దాదాపుగా అన్ని రకాల్లో శనగపిండి, చక్కెర, నూనె వాడతారు. లడ్డూ మంచి బలమైన ఆహారం. ఇందులో వేసే జీడిపప్పు, బాదం ద్వారా ఫాటియాసిడ్లు, అమినోయాసిడ్లు, బి-కాంప్లెక్స్ విటమిన్లు లభిస్తాయి. బలవర్ధకంగా పని చేస్తాయి. ద్రాక్ష, కిస్మిస్‌ల ద్వారా సి-విటమిన్ లభిస్తుంది.

జంతికలు



జంతికలు, చుప్పులు, కారప్పూస ఇవన్నీ కారాల జాబితాలోవే. వీటి తయారీకి వాడే ముడిపదార్థాలు దాదాపు ఒక్కటే అయినా చేసే పద్ధతులను బట్టి రకరకాల పేర్లతో పిలుస్తుంటారు. వీటి తయారీకి బియ్యం పిండి, శనగపిండి, మినపపిండి, మైదాలతో పాటు ఇంగువ, జీలకర్ర, వాము వంటివి వేసి నూనెలో వేయించి తయారు చేస్తారు. ఇవి తినేందుకు మంచి రుచిగా ఉండటమే కాక వాము, జీలకర్ర వంటివి జీర్ణశక్తిని పెంచుతాయి. సుమారు 20 రోజుల వరకూ నిల్వ ఉండే ఈ కరకరలాడే కారాలన్నీ అందరికీ నచ్చుతాయి. ఈ పండగకి అంతా ఇష్టంగా తినే మరో వంటకం రేగుపళ్ల పచ్చడి. పుల్లపుల్లగా.. కాస్త తీయగా.. మరికాస్త కారంగా ఉండే ఈ పచ్చడి మంచి రుచిగా ఉండటమే కాదు శరీరానికి సి-విటమిన్‌ను, శక్తిని పుష్కలంగా అందిస్తుంది.

మైసూర్ పాక్



శనగపిండి, చక్కెర, నూనె లేదా నెయ్యితో చేసే మైసూర్ పాక్ కూడా బలవర్ధకమైన ఆహారమే. ఎక్కువ కాలరీలున్న దృష్ట్యా దీన్ని కాస్త మితంగా తీసుకోవాల్సి ఉంటుంది.

అప్పాలు



బియ్యం, పల్లీ, శనగపిండి, అల్లం, వెల్లుల్లి, కరివేపాకుతో తయారు చేస్తారు. పల్లీల్లో ఐరన్ ఉంటుంది. ధాతు పుష్టికి, రక్తాన్ని పెంచేందుకు ఉపకరిస్తుంది. శక్తి ఉత్పత్తి వాహకాలుగా పనిచేస్తాయి. వెల్లుల్లి జీర్ణాశయంలో అగ్నిదీప్తిగా పనిచేస్తుంది. ఆకలిని పెంచుతుంది. మలమూత్ర బద్ధకాన్ని తొలగిస్తుంది. కడుపులో నొప్పిని తగ్గిస్తుంది.

ఎన్నప్పలు (పాకు ఉండలు)



సంక్రాంతి పండుగకు ఎన్ని పిండి వంటలు చేసుకున్నా ఎన్నప్పలు లేకపోతే ఏదో వెలితిగానే ఉంటుంది. అందుకే గ్రామాల్లో మహిళలు వీటిని సంక్రాంతి సందర్భంగా తయారు చేసి పండుగ తరువాత వారం పది రోజులు వరకు తినేవిధంగా నిల్వ చేస్తారు. పిల్లలు ఎంతో ఇష్టంగా పాకుఉండలు తింటారు. వీటి తయారీలో కొబ్బరి, బియ్యం పిండి, నువ్వులు, బెల్లం ఉపయోగిస్తారు. వీటి ద్వారా ప్రొటీన్లు, ఐరన్, ఖనిజ లవణాలు శరీరానికి అంది శీతాకాలంలో ఎటువంటి శారీరక సమస్యలు రాకుండా కాపాడుకోవచ్చు.

సున్నుండలు



సహజంగా శీతాకాలంలో చర్మం పొడి బారుతుంది. పొడిబారే చర్మాన్ని కాంతివంతంగా చేసే లక్షణమున్న పిండివంట సున్నుండలు. మినప పిండి, నెయ్యి, బెల్లం కలయికతో చేసే ఈ సున్నుండలు శరీరంలో హార్మోన్లను సమతుల్యంగా ఉంచటానికి ఉపయోగపడతాయి. తెలుగు వారి ఇళ్లలో సంక్రాంతి కొత్త అల్లుళ్లకు సున్నుండలు కొసరి కొసరి తినిపిస్తారు.



● బియ్యం వేయిస్తే మురియాలు అవుతాయి. ధాన్యం వేయిస్తే పేలాలు అవుతాయి. వీటిని బెల్లంతో కలిపి పాకం పట్టి ఎంతో చక్కగా తినడానికి ఎంతో అనుకూలంగా ఉండల్లా తయారు చేస్తారు. ఇది ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్న పని. వేకువజాము నుంచే వీటిని తమ ఇళ్ల వద్ద కుటుంబీకులతో కలిసి తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తుంటారు. ఇది బాలింతలకు ఎంతో మంచి ఆహారమని పెద్దలు చెబుతారు.

19న వేమన జయంతి

విజయనగరం రూరల్, జనవరి 12 : స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో ఈనెల 19న వేమన జయంతి కార్యక్రమం ప్రభోదసేవాసమితి, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు ఆ సంస్థ జిల్లా అధ్యక్షుడు వి.శంకరరావు చెప్పారు. ఈ మేరకుఆదివారం విజయనగరంలోని సంఘ కార్యాలయంలో వేమన జయంతి కరపత్రాలు, పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 19న వేమన జయంతి కార్యక్రమంలో భాగంగా టీటీడీ కళ్యాణ మండపంలో ఉదయం ఆరు గంటల నుంచి ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక ప్రవచనాలునిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన సమితి అధ్యక్షులు రామినాయుడు, త్రినాథ్, శ్రీను, జనార్దనరావు, విశ్వేశ్వరరావు, బుల్లన్న తదితరులు పాల్గొన్నారు.

శివశంకర్‌కు పరామర్శ

శృంగవరపుకోటరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని ధర్మవరం వాసి, తెలంగాణ ఆరోగ్యశ్రీ సీఈవోగా పనిచేస్తున్న లోతేటి శివశంకర్‌ను కలెక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆదివారం పరామర్శించారు. శనివారం రాత్రి శివశంకర్ తండ్రి మృతిచెందారు. దీంతో ఆదివారం ధర్మవరంలో శివశంకర్‌ను అంబేడ్కర్ పరామర్శించారు.

నిరసనలపై నిషేధం

చీపురుపల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కర్లాంలో వెంకటరామ పౌల్ట్రీస్ వద్ద నిర్ణీత పరిధిలో సమ్మెలు, నిరసనలు, పరిశ్రమలోని జీవాలకు నష్టం కలిగించే కార్యకలాపాలపై నిషేదం విధిస్తూ జిల్లా న్యాయస్థానం ఇంజక్షన్ ఉత్తర్వులు జారీ చేసినట్లు పరిశ్రమ డిప్యూటీ జనరల్ మేనేజరు కె.గౌరిదేవి ఒక ప్రకటనలో తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు కొద్దిరోజులుగా తమ వేతన పెంపుదలకు సంబంధించి నిరవధిక దీక్షలు చేస్తున్న విషయం విదితమే. ఈ నేపథ్యంలో యాజమాన్యం కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం ఇంజక్షన్ ఆర్డరును జారీ చేసింది. లైవ్ స్టాక్ పరిశ్రమ కావడంతో, పరిశ్రమకు కనీసం 500మీటర్ల పరిధిలో నిరసన దీక్షలు, సంస్థకునష్టం చేకూర్చే కార్యకలాపాలపై నిషే ధం విధిస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసినట్టు డీజీఎం తెలిపారు. పరిశ్రమతో సంబంధం ఉన్నవారు ఈ విషయాన్ని గమనించాలని ఆమె సూచించారు.

క్విజ్ పోటీలో నెల్లిమర్లకు ద్వితీయస్థానం

లక్కవరపుకోట, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగుబూడిలో యువజన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన క్విజ్ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా సోంపేట జట్టు మొదటి స్థానం కైవనం చేసుకుంది. శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, విశాఖ జిల్లాల నుంచి మొత్తం 22 జట్లు పాల్గొన్నాయని నిర్వాహకులు రాధాకృష్ణ యువజన సంఘ ప్రతినిధులు తెలిపారు. క్విజ్ మాస్టర్ కర్రి రాము ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నెల్లిమర్ల ద్వితీయ, శొంట్యాం మూడు, అక్కిరెడ్డి పాలెం నాలుగు, కల్లేపల్లి ఐదు స్థానాల్లో నిలిచాయి.

రూ.350 కోట్లతో గ్రామీణ రోడ్లు: మంత్రి

గజపతినగరం, జనవరి12 (ఆంధ్రజ్యోతి):ఉపాధి హామీ పథకం ద్వారా రూ.350 కోట్లతో రాష్ట్రంలో గ్రామీణ రోడ్ల పనులు చేపడుతున్నట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం గజపతినగరం టీడీపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడునెలల్లోనే రాష్ట్రంలో అభివృద్ధి పనులు పరుగులు తీస్తున్నాయన్నారు. గజపతినగరం నియోజకవర్గం పరిధిలో బొండపల్లి మండలంలో తాగునీటిసమస్య తలెత్తకుండాపనులు వేగవంతంగా జరిగేలా అధికారులకు ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. గజపతినగరం, దత్తిరాజేరు, మెంటాడ మండలాలకు ఆర్టీసి బస్సు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గజపతినగరం మండలంలోని మరుపల్లిలో 80 ఎకరాల్లో ఫుడ్‌పార్క్ నిర్మాణాలు చేపట్టేలా చర్యలుతీసుకోవడంతోపాటు అదనంగా వందఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌కు ప్రణాళికలు రూపొందించనున్నట్లు చెప్పారు. బొండపల్లి మండలంలో 50 ఎకరాలు స్థల సేకరణ చేపట్టి పరిశ్రమల ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశామన్నారు. గంట్యాడ మండలంలోని తాటిపూడి రిజర్వాయర్ ఆధునీకీకరణ పనులతోపాటు పర్యాటకాన్ని అభివృద్ధిచేశామన్నారు. రైతులకు గత ప్రభుత్వం ఇవ్వాల్సిన బకాయిలను చెల్లింపులు చేపట్టడంతో పాటు ధాన్యం ఇచ్చిన రైతులకు 48గంటల్లో వారి ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేస్తోందన్నారు. మూడు లక్షలమెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం కాగా సంక్రాంతికి ముందే 70శాతం కొనుగోలు చేశామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పీవీవీ గోపాలరాజు, నాయకులు శీరం రెడ్డి రామ్‌కుమార్, ప్రదీప్ కుమార్, లెంక బంగారునాయుడు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మక్కువ శ్రీధర్, దత్తిరాజేరు టీడీపీ మండలాధ్యక్షులు చప్పా చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

దత్తిరాజేరు, జనవరి 12(ఆంధ్రజ్యోతి):మండలంలోని చుక్కపేటకు చెందిన పొల సత్యనారాయణకు సీఎంఆర్ఎఫ్‌చెక్కును మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆదివారం అందజేశారు.హృదయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఇటీవల విశాఖలో చికిత్స పొందారు. ఈమేరకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి విడుదలైన రూ.2 లక్షల చెక్కును ఆదివారం అందజేశారు.

కూలిపోయిన రైవాడ కాలువ కల్వర్టు

● నిలిచిన రాకపోకలు ● అవస్థలుపడుతున్న బల్లంకి, బానాది గ్రామస్థులు



కూలిపోయిన కాలువపై కల్వర్టు

వేపాడ జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బల్లంకి-ఆనందపురం రహదారిలో రైవాడ కాలువపై ఉన్న కల్వర్టు ఆదివారం కూలిపోయింది. కాలువ నిర్మించి దశాబ్దాలు గడుస్తున్నా కనీస మరమ్మతులు లేవు. దీంతో కాలువ పూర్తిస్థాయిలో శిధిలావస్థకు చేరుకుంది.ఈ నేపథ్యంలో ఎప్పుడైనా కూలిపోయే ప్రమాదముందని పలుసార్లు మొరపెట్టుకున్నా జీవీఎంసీ అధికారులు పట్టించుకోలేదని బల్లంకి, బానాది, ఎం.సిం గవరం గ్రామస్థులు వాపోయారు. జీవీఎంసీ అధికారులు స్పందించి కూలిపోయిన కల్వర్టు స్థానంలో కొత్తది నిర్మించి, రాకపోకలను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు సూచించారు. తొలుత తాత్కాలికంగా రాకపోకలకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

జూట్ మిల్లును తెరిపించాలి

● జనసేన నాయకుడు చనమల్లు వెంకటరమణ



పవన్‌కల్యాణ్‌ను కలిసిన చనమల్లు

నెల్లిమర్ల, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మూతపడిన నెల్లిమర్ల జూట్ మిల్లును తెరిపించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని జనసేన నాయకుడు, డీసీసీబీ మాజీ వైస్ చైర్మన్ చనమల్లు వెంకటరమణ కోరారు.ఈమేరకు మంగళగిరిలోనిజనసేన కార్యాలయంలో జనసేన నాయకుడు లోకం ప్రసాద్‌తో ఉపముఖ్యమంత్రి కె.పవన్‌కల్యాణ్‌ను వెంకటరమణ ఆదివారం కలిశారు.ఈ సందర్భంగా నెల్లిమర్లకు సంబంధించిన పలుసమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. నెల్లిమర్ల జూట్ మిల్లు జూన్ నుంచి మూతపడడంతో వేలాది కార్మిక కుటుంబాలు వీధినపడ్డాయని వివరించారు. నెల్లిమర్లలోని పేదలకు గృహ యోగం కల్పించాలని, టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించాలని కోరారు.

గ్రామదేవత ఉత్సవాల్లో వివాదాలొద్దు

రాజాం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజాం మండలంలోని బొద్దాంలోని మంగళవారం జరిగే మంగమ్మ పేరంటాలు గ్రామదేవత ఉత్సవాల్లో వివాదాలకు ఆస్కారం లేకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని చీపురుపల్లి డీఎస్పీ రాఘవులుకోరారు. ఆదివారం రాజాం పోలీస్ స్టేషన్‌లో బొద్దాం గ్రామపెద్దలు, ఉత్సవాల కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన వివరాలను గ్రామపెద్దలను అడిగితెలుసుకున్నారు. ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ రవికిరణ్ పాల్గొన్నారు.

వాజీ చానల్ ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి: వాజీ ఎండీ శ్రీనివాసరావు



విజయనగరం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో వాజీ చానల్ ఆధ్వర్యంలో రంగోళి పోటీలు నిర్వహించారు. పోటీలకు అనూహ్య స్పందన లభించింది. మహిళలు తరలివచ్చారు. ముగ్గులతో సంక్రాంతి శోభ సంతరించుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కనుమరుగవుతున్న సంప్రదాయాలను కాపాడాలన్న లక్ష్యంతో వాజీ ఛానల్ గత 29 ఏళ్లుగా రంగోళి పోటీలు నిర్వహిస్తున్నదన్నారు. పోటీల్లో పాల్గొన్న మహిళలందరికీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

మైత్రీ మీడియా ఆధ్వర్యంలో రంగోళి పోటీలు



విజయనగరం రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని గురజాడ కళాభారతి ఆవరణలో ఆదివారం మైత్రీ మీడియా ఆధ్వర్యంలో రంగోళి పోటీలు నిర్వహించారు. భావి తరాలకు పండుగ సంప్రదాయాలు అందించాలన్న ఉద్దేశంతో రంగవల్లుల పోటీలు నిర్వహించినట్టు మైత్రీ మీడియా యాజమాన్య ప్రతినిధులు మజ్జి శిరీసహస్ర, అవనాపు విక్రమ్‌లు అన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లోని మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పోటీల్లో పాల్గొనడం ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన యుట్యూబర్ సామంతపూడి శ్రావణి మాట్లాడుతూ, సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఇటువంటి రంగోళి పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యాజమాన్య ప్రతినిధులు కాకర్లపూడి సీతాదేవి, జీతెలుగు, జీ సినిమాల ప్రతినిధి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు

వేపాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంక్రాంతి, తీర్థమహోత్స వాలు పురష్కరించుకొని కోడి పందేలు, జూదం, బల్లాటలు, పొట్టేళ్ల పందేలు నిర్వహిస్తే కేసులు నమోదుచేయడంతోపాటు చర్యలు తీసుకుంటామని వల్లం పూడి ఎస్ఐ బొడ్డుదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు కోడి, పొట్టేళ్ల పందేలు, జూదం, బల్లాటలు నిషేధించినట్లు పేర్కొన్నారు.

విద్యుత్ తీగల చోరీపై కేసు నమోదు

విజయనగరం క్రైం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని ఉమారామలింగేశ్వరాలయం జంక్షన్ నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ వైర్లు చోరీకి పాల్పడిన ఘటనపై కేసునమోదు చేసినట్లు టూటౌన్ సీఐ టి.శ్రీనివాసరావు తెలిపారు. అశోక్‌నగర్‌కు చెందిన గొద్దు శంకరరావు నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో విద్యుత్ వైర్లు దొంగతనం చేయడానికి వెళ్లి ఐదో అంతస్థులో నిర్మాణంలో ఉన్న లిఫ్టులో కాలు జారి కింద పడిపోవడంతో అక్కడిక్కడే మృతి చెందిన విషయం విదితమే.ఈ మేరకుకేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

1,189 కేజీల పీడీఎస్ బియ్యం స్వాధీనం

వేపాడ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని బొద్దాం పంచాయతీ శివా రు కొత్తబొద్దాంలో అక్రమంగా రవాణాకు సిద్ధంచేసిన 1,189 కేజీల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నట్లు సీఎస్‌డీటీ రామకృష్ణ తెలిపారు. గ్రామానికి చెందిన వ్యాపారి కల్లూరి అనీల్‌వ్యాన్‌పై రవాణాకు బియ్యాన్ని సిద్ధం చేస్తున్న ట్టు విజిలెన్స్ పౌరసరఫరాల డీటీకి సమాచారం అందిందని చెప్పారు. ఈ మేరకు మాటు వేసి పట్టుకున్నామని, బాధ్యుడైన కల్లూరి అనీల్‌పై 6ఎ కేసు నమోదు చేసినట్టు లిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

భోగాపురం, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం రాత్రి జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలయ్యాయి. బాధితులు, స్థానికుల కథనం మేరకు.. డెంకాడ మండలంలోని బంటుపల్లి పంచాయతీ గొంపవాని పేటకు చెందిన ఆరుగురుఆటోపై విశాఖ జిల్లా రేగిడి వెళ్లి తిరిగి బయలుదేరారు. విశాఖ నుంచి శ్రీకాకుళం వెళ్లే పోలిపల్లి సమీపంలోగల సర్వీస్ రహదారిపై అదే రహదారిలో వెళ్తున్న ట్రాక్టర్‌ఢీకొంది. దీంతో గొంప నరసింహులు, గొంప అప్పన్న, చూరమ్మలకు గాయాలయ్యాయి. వీరిని హైవే మొబైల్‌లో చికిత్స నిమిత్తం సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. అలాగె భోగాపురం పంచాయతీ అప్పన్నపేటకు చెందిన వనుం అప్పన్న ద్విచక్రవాహనంపై భోగాపురం వైపు నుంచి నాతవలస వైపు వెళ్తుండగా పెదఖానాల సమీపంలో అదుపుతప్పి పడిపోవడంతో తలకు గాయమైంది. ఆయన్ను సీహెచ్‌సీకి తరలించారు.

విజయనగరంలో ప్రజా మరుగుదొడ్ల కూల్చివేత

● స్థలాన్ని పరిశీలించిన నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య



మరుగుదొడ్లను తొలగించిన స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం రింగురోడ్డు, జనవరి 12(ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని 40వ డివిజన్‌లో పరిధిలోగల పోలయ్యపేటలో నిర్మిస్తున్న ఓ అపార్ట్‌మెంట్ ఎదురుగా ఉన్న నగరపాలక సంస్థకు సంబంధించి ప్రజా మరుగుదొడ్లను శుక్రవారం అర్ధరాత్రి యంత్రాలతో కూల్చివేశారు. మరుగుదొడ్ల స్థలంలో ఉన్న గుంతలను కప్పివేయడంతోపాటు శిథిలాలు, చెట్లను తొలగించి చదునుచేశారు. మరుగుదొడ్ల కూల్చివేతలో భవనానికి సంబంధించి బిల్డర్, ప్రతిపక్షపార్టీకి చెందిన ఇద్దరు కార్పొరేటర్ల హస్తం ఉందని శనివారం స్థానికులు కమిషనర్ పి.నల్లనయ్యకు ఫిర్యాదుచేశారు. దీంతో కమిషనర్ నల్లనయ్య అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. సమీపంలోని అపార్ట్‌మెంట్ భవన నిర్మాణదారులకు ఈఘటనలో కీలకపాత్ర ఉందని ప్రాథమికంగా గుర్తించారు. ఈమేరకు ఏఎల్ ఫలేష్, సత్య వెంచర్స్ అండ్ కనస్ట్రక్టర్స్, ఎస్ఎస్ ట్రేడర్స్, ఎంబీపీ వెంచర్స్, నెక్స్‌జెన్ వెంచర్స్ నిర్వాహకులపై విచారణచేపట్టనున్నట్లు కమిషనర్ తెలిపారు. ఈవిషయంపై పోలీసుస్టేషన్‌కు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. నగరపాలక సంస్థ ఆస్థులు ఎవరైనా విధ్వంసం చేస్తే ఊపేక్షించబోమని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కమిషనర్ వెంట డీఈ మణికుమార్, సిబ్బంది ఉన్నారు.

వివేకానంద విగ్రహావిష్కరణ

రాజాంరూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అంతకాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వివేనందుడి విగ్రహాన్ని పాఠశాల నిర్వహణ కమిటీ ఛైర్మన్ వరహాలునాయుడు ఆదివారం ఆవిష్కరించారు. పార్వతీపురానికి చెందినఅమ్మశ్రీ రజని రాజా కళాక్షేత్రం నిర్వాహకులు విగ్రహాన్ని సమకూర్చారు.కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, శీనివాసరావు, మాధవీలత, మాజీ సర్పంచ్ వల్లూరు పాపినాయుడు, అచ్యుతరావు, వెంకటనాయుడు, సూర్యారావు, అప్పలనాయుడు పాల్గొన్నారు.

●గజపతినగరం, జనవరి12(ఆంధ్రజ్యోతి):గజపతినగరంలో ధర్మజాగరణ సమితి సభ్యులు వివేకానంద విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కనకళచంద్రరావు, నక్కతవుడు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు వివేకానందుడు

● కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ ● ఘనంగా జాతీయ యువజనోత్సవం



వివేకానందుని విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

పార్వతీపురంటౌన్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): వివేకానందుడు ఆదర్శప్రాయుడని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ అన్నారు. స్వామీ వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక జట్టు ఆశ్రమంలో నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్వచ్ఛ సుందర పార్వతీపురంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ సీఈవో రామ్‌గోపాల్, డీఈవో తిరుపతినాయుడు, జట్టు ఆశ్రమ నిర్వాహకురాలు పద్మజ పాల్గొన్నారు. ● జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో లైన్స్ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో జరిగిన జాతీయ యువజనోత్సవాలకు ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

ఉత్తమ గిరిజన కళాకారుడిగా నాగభూషణం



ఐటీడీఏ పీవో నుంచి మెమోంటో అందుకుంటున్న నాగభూషణరావు

గుమ్మలక్ష్మీపురం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన నాగభూషణం మాస్టారు ఉత్తమ గిరిజన కళాకారుడిగా ఎంపికయ్యారు. వివేకానంద జయంతి సందర్భంగా పార్వతీపురంలో ఆదివారం నిర్వహించిన యువజన ఉత్సవాల్లో నాగభూషణరావు మాస్టారు బృందం గిరిజన నృత్యాన్ని ప్రదర్శించింది. అనంతరం ఆయన బృందంతో కలిసి పార్వతీ పురం ఐటీడీఏ పీవో శ్రీవాత్సవ చేతులమీదుగా మెమోంటో, ధ్రువపత్రం అందుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

సీతానగరం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ ఘటన కాశీపేట గ్రామ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన పత్తిగూల సీతారాం ద్విచక్ర వాహనంపై తన గ్రామం నుంచి కాశీపేట వస్తుండగా పార్వతీపురం నుంచి వస్తున్న లారీ సీతారాంను ఢీకొంది. ఈ ప్రమాదంలో సీతారాం తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు స్పందించి క్షతగాత్రుడిని బొబ్బిలి ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరిశీలించి, మెరుగైన వైద్యం కోసం విజయనగరం తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ రాజేష్ కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

బొబ్బిలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి నేపథ్యంలో కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ కె.సతీష్ కుమార్ హెచ్చరించారు. ఆదివారం బొబ్బిలి తహసీల్దార్ కార్యాలయంలో ఆయన సమక్షంలో తహసీల్దార్ ఎం.శ్రీను.. గతంలో కోడి పందేలు, గొర్రె పందేలు, పేకాట ఆడుతూ దొరికిన వారిని పిలిపించి హెచ్చరికలు జారీ చేశారు. మళ్లీ ఇటువంటి ఆటలు ఆడితే బైండోవర్ కేసులు నమోదు చేస్తామని చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలందరూ నిబంధనలు పాటిస్తూ సంక్రాంతి పండుగ జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు. ● గుమ్మలక్ష్మీపురం: సంక్రాంతి పండగ నేపథ్యంలో సర్కిల్ పరిధిలో పేకాట, కోడి పందేలు, గొర్రె పందేలు, సారా అమ్మకాలపై పోలీసులు ప్రత్యేక దృష్టిపెట్టారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో సారా తయారీ అమ్మకాలు చేపడితే కేసులు పెట్టడానికి వెనుకాడ వద్దని తమ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు తెలిపారు.

సాలూరులో ప్రచారం

సాలూరు రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు, పేకాటలు నిర్వహించినా చట్టపరమైన చర్యలు తప్పవని సాలూరు పట్టణ సీఐ బి.అప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం సాలూరులో ఆయన ఆధ్వర్యంలో మైక్ ద్వారా ప్రచారం చేశారు.

తిరుమల బాధితునికి ఆర్థిక సాయం

కొత్తవలస, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి ప్రత్యేక దర్శనం టిక్కెట్ల కోసం తిరుమలలో లైన్‌లో ఉండి, జరిగిన తొక్కిసలాటలో గాయపడిన వారికి ప్రభుత్వం రూ.2 లక్షల ఆర్థిక సాయం ప్రకటించింది. ఈ మేరకు కొత్తవలస మండలంలోని జీఎస్ఎన్ రాజునగర్‌కు చెందిన బి.శ్రీనివాసరావుకు ఆదివారం విశాఖ విమానాశ్రయం వద్ద ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి, టీటీడీ బోర్డు సభ్యులు ఎంఎస్ రాజు, పనబాక లక్ష్మీ, జంగా కృష్ణమూర్తి చేతులమీదుగా రూ.2లక్షల సాయం శ్రీనివాసరావుకు అందజేశారు. టీడీపీ నాయకులు కె.రాంప్రసాద్, పి.వెంకటరత్నాజీ, జగన్నాథంనాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల కలయిక



రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో కలిసిన పూర్వ విద్యార్థులు

రాజాం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాజాం ప్రభుత్వోన్నత పాఠశాలలో 2004-05 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పించిన పూర్వ ఉపాధ్యాయులు, అప్పటి హెచ్ఎం సీహెచ్ మల్లేశ్వరరావుతో పాటు ప్రస్తుత హెచ్ఎం పి.నాగయ్యను సన్మానించారు.

బొబ్బిలిలో..

బొబ్బిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా ఆర్ఎస్ఆర్‌కే రంగారావు కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం ఘనంగా జరిగింది. 1992-95 బీఏ ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్ బ్యాచ్‌కు చెందిన వారంతా సమావేశమయ్యారు. పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి డాక్టర్ చోడిగంజి రవి ఆధ్వర్యంలో ఆనాటి ప్రిన్సిపాల్ డి.రఘునాథరావు, అప్పటి అధ్యాపకులు ఎస్.వినయభూషణరావు, పి.జాన్‌నెల్సన్, కేఎంవీ, అంజలీదేవి, కె.లక్ష్మునాయుడు, సి.వేణుగోపాలరావు, గౌరీశ్వరరావు, డీవీ జగ్గారావు, అధ్యాపకేతర సిబ్బందిని ఘనంగా సన్మానించారు.



ఆనాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అర్హులందరికీ గోకులాలు

● గిరిజన, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి



భోగి మంటను వెలిగిస్తున్న మంత్రి సంధ్యారాణి

పాచిపెంట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ గోకులాలు మంజూరు చేసే యోచనలో ఉందని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మాతుమూరు గ్రామంలో రూ.1.80 లక్షలతో నిర్మించిన గోకులాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. ముందుగా అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ భోగి మంటను వెలిగించారు. అనంతరం ప్రకృతి సేద్యంతో పండించిన పంటల స్టాల్స్ పరిశీలించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ప్రభుత్వం రాష్ట్రంలో గోకులాల నిర్మాణానికి రూ.500 కోట్ల నిధులు విడుదల చేసిందని ఆమె చెప్పారు. గోశాలల నిర్మాణాలకు సాలూరు నియోజక వర్గానికి కోటి రూపాయలు మం జూరు చేయగా, పాచిపెంట మండలానికి రూ.32లక్షలు మంజూరు చేసినట్టు చెప్పారు. టీడీపీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ముఖి సూర్యనారాయణ, నాయకులు గూడేపు యుగంధర్ తదితరులు పాల్గొన్నారు. ● జియ్యమ్మవలస: కుదమ పంచాయతీ పెదకుదమ గ్రామంలో నిర్మించిన గోకులా న్ని టీడీపీ అరకు పార్లమెంటరీ నియోజకవ ర్గ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ ఆదివారం ప్రారంభించారు. ఎంపీటీసీ సభ్యుడు పాలక బుజ్జి, యేగిరెడ్డి అప్పలనాయుడు పాల్గొన్నారు. ● గరుగుబిల్లి: రావుపల్లిలో నిర్మించిన మినీ గోకులాలను ఎంపీపీ ఉరిటి రామారావు ఆదివారం ప్రారంభించారు. సర్పంచ్ బొంతాడ మహేష్, ఏపీవో ఎం.గౌరీనాథ్ పాల్గొన్నారు. ● డెంకాడ: గోకులాలు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు తెలిపారు. డెంకాడ, గుణుపూరు, తాడివాడలో ఆదివారం మినీగోకులాలను ప్రారంభించారు. ఈవోపీఆర్డీ శ్రీనివాసరావు, పార్టీ నాయకులు పల్లె భాస్కరరావు, ప్రదీప్‌రాజు, జనసేన నాయకులు పైల శంకరరావు, చింతపల్లి రామ్మూర్తి పాల్గొన్నారు. ● భోగాపురం: చాకివలసలో ఆదివారం గోకులం షెడ్లను ప్రారంభించారు. సర్పంచ్ లంక వెంకటలక్ష్మి, ఎంపీడీవో కిషోర్‌కుమార్, ఏపీవో బాగ్యలక్ష్మి పాల్గొన్నారు. ● రాజాం: ఎం.జోగివలస, జీసీహెచ్‌పల్లి, శ్యాంపురంలో మినీ గోకులాలను టీడీపీ నాయకుడు కోండ్రు జగదీష్ ఆదివారం ప్రారంభించారు. ● బాడంగి: రాష్ట్రంలో పాడి రైతుల మేలు కోసమే ప్రభుత్వం గోశాలలు ఏర్పాటు చేస్తోందని బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడు అన్నారు. పెదపల్లి, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్మించిన గోకులాల షెడ్లను ఆయన ఆదివారం ప్రారంభించారు. టీడీపీ మండల అధ్యక్షుడు తెంటు రవిబాబు, టీడీపీ రాష్ట ఎస్టీ సెల్ జనరల్ సెక్రటరీ, గజరాయనివలస ఎంపీటీసీ పాలవలస గౌరి పాల్గొన్నారు.

తోటపల్లి అభివృద్ధికి చొరవ చూపడం అభినందనీయం

● ప్రభుత్వ విప్ జగదీశ్వరి



దుకాణ సముదాయాలను ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గరుగుబిల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానం అభివృద్ధికి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్టు ప్రతినిధులు ప్రత్యేక చొరవ చూపడం అభినందనీయమని ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ డి.పారినాయుడు అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా విప్ మాట్లాడుతూ ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వపరంగా సహకారం అందించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. టీటీడీ ఛైర్మన్, ఈవోల దృష్టికి సమస్యలు వివరించడంతో పాటు నిధులు కేటాయింపునకు కృషి చేస్తామని చెప్పారు. సమావేశానికి ముందుగా స్వామి వివేకానందస్వామికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ.15లక్షలతో నిర్మించిన ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని, దుకాణ సముదాయాన్ని ప్రారంభించారు. వచ్చే నెలలో నిర్వహించనున్న ప్రతిష్ఠా కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పల వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ ఎ.మధుసూదనరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ, సర్పంచ్ ఆవాల సింహాచలం, ఎంపీటీసీ సభ్యులు ఎం.సింహాచలంనాయుడు, సంతోషపురం సర్పంచ్ అంబటి రాంబాబు, ఆలయ దాత కిమిడి శ్రీరామ్మూర్తి, ప్రతినిధులు, అర్చకులు, ట్రస్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదర్శ గ్రామంగా తీర్చి దిద్దేందుకు చర్యలు

గరుగుబిల్లి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గిజబను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామస్థులు నడుం కట్టారు. గతంలో వేరే ప్రాంతంలో గ్రామం ఉండేది. తోటపల్లి ప్రాజెక్టులో గ్రామం ముంపునకు గురికావడంతో వేరే ప్రాంతంలో పునరావాసం కల్పించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణతో పాటు మౌలిక వసతుల కల్పనకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు. ఆదివారం ఎనిమిది వీధులకు నామకరణం చేసి అవసరమైన బోర్డులను ఏర్పాటు చేశారు. సర్పంచ్ మండల భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలం నాయుడు, ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి ఊరేగింపు



శృంగవరపుకోట రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): ఎస్.కోట వేణుగోపాలస్వామి ఆలయం నుంచి గోదాదేవిని ఊరేగింపు కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాలి

విజయనగరం దాసన్నపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి భారతీయ జనఔషధి ప్రయోజన విక్రయ కేంద్రాలను విజయనగరం అసెంబ్లీ నియోజక వర్గ పరిధిలోని ఆసుపత్రులు, ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసే విధంగా అధికారులకు సూచనలివ్వాలని బీజేపీ ప్రతినిధి ఇమంది సుధీర్ కోరారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం ఎమ్మెల్యే అదితి గజపతిరాజుని కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అప్పారావు దొర, సీతారామ్, అప్పలనాయుడు, రామారావు, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

కేంద్ర ఆర్థిక విధానాలతో నిరుద్యోగం

విజయనగరం దాసన్నపేట, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం 2024-25 ప్రవేశపెట్టిన బడ్జెట్ పేదరికాన్ని, నిరుద్యోగాన్ని, నిరక్షరాస్యతను పెంచే విధంగా ఆర్థిక విధానా లు ఉన్నాయని మానవహక్కుల వేదిక జిల్లా కన్వీనరు బంకురు జోగినాయుడు ఆరోపించారు. ఆదివారం విజయనగరం కోట జంక్షన్ సమీపంలోని వేదిక కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో అయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలపై మేథావులు వాస్తవాలను విశ్లేషించి ప్రజలను చైతన్యవంతులు చేసినప్పుడు పేదరికం, నిరుద్యోగం, నిరక్షరాస్యత వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందన్నారు.

రాజాంలో ట్రాఫిక్ పాట్లు



రాజాంలో స్తంభించిన ట్రాఫిక్

రాజాం, జనవరి12 (ఆంధ్రజ్యోతి): రాజాంలో సంక్రాంతి పురస్కరించుకుని క్రయవిక్రయాలకు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆదివారం ట్రాఫిక్ స్తంభించిపోయింది. పాలకొండ రోడ్డులో లారీ దిగబడిపోవడంతో పాలకొండ నుంచి వచ్చిన వాహనాలు నిలిచిపోయాయి. మాధవ బజార్‌లో దుస్తులు, కిరాణాషాపులు అధికంగా ఉండడంతో ఉదయం నుంచే రాజాం, రేగిడి, వంగర తదితర మండలాల నుంచి ప్రజలు తరలివచ్చారు. అంతేకాకుండా భారీ వాహనాలు కూడా మాధవ బజార్ గుండా వెళ్లడానికి వీల్లేకుండాపోయింది. శ్రీనివాస థియేటర్ రోడ్డులో కూడా వాహనాలు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

కలియుగ భీముడు కోడి రామ్మూర్తి

● నేడు మల్ల యోధుడి వర్ధంతి

● స్వగ్రామం వీరఘట్టంలో ఏర్పాట్లు



తెలగవీధిలో ఏర్పాటు చేసిన కోడి రామ్మూర్తి విగ్రహం

వీరఘట్టం, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): కలియుగ భీముడు, ప్రపంచ మల్ల యోధు డు, జగదేక మల్లుడు, మల్ల మార్తాండ, ఇండియన్ హెర్క్యులస్.. ఇలా అనేక బిరుదులు పొంది.. మన రాష్ట్ర ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన గొప్ప వ్యక్తి కోడి రామ్మూర్తినాయుడు. సోమవారం ఆయన వర్ధంతి సందర్భంగా ప్రత్యేక కథనం. కోడి రామ్మూర్తి వీరఘట్టం గ్రామంలో వెంకన్న నాయుడు, అప్పలకొండమ్మలకు 1883లో జన్మించారు. ఈయన గ్రామంలోని కూరాకుల వీధిలో గల పాఠశాలలోనే విద్యాభ్యాసం చేశారు. రావిచెరువు వద్ద నిత్యం వ్యాయామం చేస్తూ ఉండేవాడు. విజయనగరంలోని మహారాజా కళాశాలలో వ్యాయా మ ఉపాధ్యాయుడిగా సేవలు అందిస్తూ తన సాహస ప్రస్థానం ప్రారంభించారు. కుస్తీలు, సాము గరిడీలు వంటి స్వదేశీ మెలకువల నుంచి విదేశ మెరుపుల వరకు నేర్చుకున్నారు. ప్రాణాయామం, జల, వాయు స్తంభన విద్యను శారీరక బల ప్రదర్శనకు జోడించి జగదేక మల్లుడి గా నిలిచారు. తనపై బల్ల ఉంచి ఏనుగును ఐదు నిమిషాల పాటు ఉంచారు. టన్ను బరువు ఉన్న రాయిని తన ఛాతిపై ఉంచి సమ్మెటతో కొట్టించేవారు. భారతదేశంలోనే కాకుండా ఇంగ్లాండ్, జర్మనీ, ఇటలీ, ఫ్రాన్స్, లండన్ వంటి దేశాల్లో కూడా ప్రదర్శనలు చేసి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

తప్పుడు ప్రచారాన్ని తిప్పికొడతాం

● గ్రోత్ సెంటర్ అభివృద్ధిని అడ్డుకోవడం తగదు

● బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో ఎటువంటి అభివృద్ధి కార్యకలాపాలు జరగకుండా కొంతమంది రియల్టర్లు కుట్రతో గోబెల్స్ ప్రచారానికి పూనుకున్నారని, దీనిని సమర్థవంతంగా తిప్పికొడతామని ఎమ్మెల్యే బేబీనాయన తెలిపారు. ఆదివారం స్థానిక దర్బారుమహల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రోత్ సెంటరులో కృత్రిమ కొరత సృష్టించి, రియల్ఎస్టేట్ వ్యాపారాలు చేసుకోవడానికి, బ్యాంకు రుణాలు పొంద డానికి దుర్బుద్ధితో రకరకాల ప్రచారాలు చేస్తున్నార న్నారు. దీనిని కచ్చితంగా ప్రక్షాళన చేస్తామన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలెవరూ ఈ ప్రచారాలను నమ్మవద్దని ఆయన హితవు పలికారు. జిల్లా మంత్రి, స్థానిక ఎంపీల చొరవతో రెండు అతి పెద్ద పరిశ్రమలు గ్రోత్‌సెంటరులో ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయని ఆయన తెలిపారు.

● చిలకపాలెం- రాయగడ స్టేట్ హైవే వయా పొందూరు, రాజాం, రామభద్రపురం, బొబ్బిలి, సీతానగ రం, పార్వతీపురం రోడ్డుకు పీపీపీ ప్రాతిపదికన ఫోర్‌లేన్ రోడ్డు విస్తరణకు సీఎం ఆమోదం తెలిపారని ఎమ్మెల్యే చెప్పారు. రాష్ట్రంలో పెద్ద నగరాలను కలిపే అతి పెద్ద రోడ్ల మాదిరిగా ఈ స్టేట్‌హైవే బొబ్బిలి నియోజకవర్గం మీదుగా రావడం ఒక వరంగా భావిస్తున్నామన్నారు.

● 2018లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పారాది వేగావతి వంతెనను మంజూరు చేసినప్పటికీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడంతో రోడ్ల పాలిట శాపంగా మారిందని ఎమ్మెల్యే ఆరోపించారు. పారాది బ్రిడ్జి దెబ్బతినడంతో రెండు జిల్లాలకు చెందిన వాహనాలు బొబ్బిలి పట్టణం, గ్రామీణ రోడ్లపై రాకపోకలు సాగించాల్సి వచ్చిందని, దీంతో రోడ్లన్నీ ఛిద్రమయ్యాయని తెలిపారు. మార్చి నెలాఖరుకల్లా రోడ్లన్నీ సుందరంగా తయారవుతాయన్నారు. బొబ్బిలి-తెర్లాం, పినపెంకి-ఆకులకట్ట రోడ్లకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. బొబ్బిలి పట్టణంలోని రోడ్లకు బుడా నిధులు మంజూరయ్యాయని చెప్పారు. సీఎం, డిప్యూటీ సీఎం చొరవతో బొబ్బిలి నియోజకవర్గానికి రోడ్ల కోసం రూ.40 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులలో సుమారు సగం పనులు ప్రారంభమయ్యాయన్నారు. మరో రూ.10కోట్లతో ప్రతిపాదనలు పంపామన్నారు.

● నియోజకవర్గ పరిధిలో కొంతమంది అధికారులు ఇంకా పాతవాసనల ప్రభావంతో పనిచేస్తున్నారని, అలాంటి వారంతా తమ వైఖరిని మార్చుకోవాలని హెచ్చరించారు. అవినీతికి తావులేని రీతిలో పనిచేస్తేనే ఈ నియోజకవర్గంలో పనిచేయగలుగుతారు లేకుంటే ఇక్కడ స్థానం లేదని ఎమ్మెల్యే బేబీనాయన గట్టిగా హెచ్చరించారు. ఆయన తొలుత నియోజకవర్గ ప్రజలకు, అధికారులకు, కార్యకర్తలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

మన సంస్కృతిని చాటిచెప్పేందుకే..

● సంక్రాంతి వేడుకలు

పార్వతీపురంటౌన్, జనవరి 12: సంక్రాంతి పండగ మన సంస్కృతిని తెలియజేస్తుందని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నోబుల్ వాకర్స్ క్లబ్ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ గవర్నర్ నారాయణస్వామి, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ బి.జయప్రకాష్ నారాయణ పాల్గొన్నారు. ● సాలూరు రూరల్: మామిడిపల్లి సరస్వతి శిశు మందిర్‌లో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.



బొబ్బిలి రూరల్: భోగి పిడకలతో శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



సాలూరు రూరల్: మామిడిపల్లిలో..

సంప్రదాయాన్ని గుర్తు చేస్తూ..

బొబ్బిలి రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): గతంలో పిల్లలు భోగి పిడకలు తయారు చేసి, మంటల్లో వేసేవారు. ప్రస్తుతం కాలం మారుతున్న కొద్దీ అవి కనుమరుగవుతున్నాయి. ఈ సంప్రదాయాన్ని పునరుద్ధరించేలా కృష్ణాపురం, రాజచెరువు వలస గ్రామాలలో శ్రీచైతన్య సేవా సంఘం అధ్యక్షుడు చుక్క శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చిన్నారులు ఆదివారం భోగి పిడకలు తయారు చేశారు.

న్యూస్ బాక్స్

గిరిజన విద్యార్థిని ఆత్మహత్య

గుమ్మలక్ష్మీపురం: జర్న గ్రామంలో ఓ గిరిజన విద్యార్థిని ఆదివారం రాత్రి ఇంటిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతికి గల కారణాలు తెలియరాలేదు. దీనిపై తమకు సమాచారం అందిందని ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు. సోమవారం పూర్తి వివరాలు తెలియచేస్తామన్నారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. విద్యార్థిని బొబ్బిలిలో ఇంటర్ చదివేది. చదువు మధ్యలో ఆపేసి మూడు నెలల కిందట ఇంటికి చేరుకుంది. అయితే వచ్చినప్పటి నుంచి ముభావంగా ఉండేదని ఎస్ఐ తెలిపారు

పేకాట శిబిరాలపై దాడి

పాలకొండ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): జి.వెంకటాపురం గ్రామ సమీపంలో ఆదివారం నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై స్థానిక పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.లక్షా 9వేల 950 నగదుతో పాటు ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ● బొబ్బిలి రూరల్: దిబ్బగుడ్డివలస గ్రామ శివారులో ఆదివారం ఎస్ఐ రమేష్ ఆధ్వర్యంలో సిబ్బంది పేకాట శిబిరంపై దాడి చేసి, నలుగురిని అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. వారి వద్ద నుంచి రూ.35,200, నాలుగు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.

బెల్లపు ఊటల ధ్వంసం

సీతంపేట రూరల్, జనవరి 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాపరాయిగూడ గ్రామ సమీపంలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో 300లీటర్ల బెల్లపు ఊటలను ధ్వంసం చేసినట్టు ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసు సిబ్బంది చేసిన దాడుల్లో సారా ఊటలను గుర్తించి ధ్వంసం చేశామని ఎస్ఐ చెప్పారు.

మొక్కల పంపిణీ

మక్కువ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): వెంకటబైరిపురం గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఎంఎస్ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు మరడ శ్రీనివాసరావు ఆదివారం రూ.5వేలు విలువల చేసే మొక్కలను పంపిణీ చేశారు. ఈ మొక్కలను స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నాటుతామని చెప్పారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

విజయనగరం రూరల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలోని కేఎల్ పురం కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం బేబీ ధన్య ఫౌండేషన్ ప్రతినిధులు పారిశుధ్య కార్మికులకు సన్మానించి, దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడికి మంత్రి పరామర్శ

మక్కువ, జనవరి 12 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన టీడీపీ మండల అధ్యక్షుడు గుల్ల వేణుగోపాలనాయుడును మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం పరామర్శించారు. శనివారం వేణుగోపాలనాయుడు ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న మంత్రి ఎ.వెంకంపేటలోని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించారు. ఆమెతో పాటు కూటమి నాయకులు ఉన్నారు.